14 మంది ఎంపీల సస్పెన్షన్

- పార్లమెంటులోకి దుండగుల చొరబాటుపై.. ఉభయ సభల్లో ప్రతిపక్షాల ఆందోళన
- కార్యకలాపాలను స్తంభింపజేసిన సభ్యులు
- హోం మంత్రి ప్రకటన చేయాలని పట్టు
- లోక్‌సభ నుంచి 13 మంది ఎంపీల సస్పెన్షన్
- రాజ్యసభ నుంచి డెరెక్ ఓబ్రియాన్ సస్పెండ్
- పార్లమెంటు భద్రత నా బాధ్యత: స్పీకర్
- ఇది చర్చించేంత పెద్ద విషయమేమీ కాదు
- కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రకటన
- పట్టు విడువని విపక్షాలు.. దిగిరాని సర్కారు
- ప్రివిలేజ్ కమిటీకి డెరెక్ ఓబ్రియాన్ వ్యవహారం

న్యూఢిల్లీ, డిసెంబర్ 14: పార్లమెంటులోకి దుండగుల చొరబాటుపై పార్లమెంటు ఉభయ సభలు గురువారం అట్టుడికాయి. భద్రతా లోపాలపై ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటనలు చేయాలని విపక్షాలన్నీ ఒక్కతాటిపైకి వచ్చి డిమాండ్ చేయటంతో సభా కార్యక్రమాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇదేమంత పెద్ద విషయం కాదని ప్రభుత్వం ప్రకటించటంతో రగడ మరింత ముదిరింది. దీంతో లోక్‌సభ నుంచి 13 మందితోపాటు రాజ్యసభ నుంచి టీఎంసీ ఎంపీ డెరెక్ ఓబ్రియాన్‌ను సస్పెండ్ చేశారు. శీతాకాల సమావేశాలు ముగిసేవరకు వారికి సభలోకి ప్రవేశం లేదని ప్రకటించారు.

విపక్షం పట్టు.. ప్రభుత్వం బెట్టు

పార్లమెంటులోకి బుధవారం ఇద్దరు దుండగులు జొరబడి లోక్‌సభ సమావేశ మందిరంలో నానా రభస సృష్టించిన విషయం తెలిసిందే. సభలో గ్యాస్ వదిలి భయోత్పాతం సృష్టించారు. పార్లమెంటు భవనం బయట కూడా ఇద్దరు వ్యక్తులు నిరసన తెలిపారు. ఈ ఘటనపై గురువారం సమావేశాలు ప్రారంభం కాగానే విపక్ష సభ్యులు ఆందోళనకు దిగారు. హోంమంత్రి వెంటనే వచ్చి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇతర కార్యక్రమాలన్నీ రద్దు చేసి భద్రతా లోపాలపై చర్చ చేపట్టాలని ఉభయ సభల్లో వాయిదా తీర్మానాలు ఇచ్చారు. వీటిని లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌కర్ తిరస్కరించటంతో విపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి పెద్దపెట్టున నినాదాలు చేశారు. దీంతో సభలు పలుసార్లు వాయిదా పడ్డాయి. చివరకు లోక్‌సభ సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభమైన తర్వాత కూడా పరిస్థితిలో మార్పు రాలేదు. ప్రభుత్వం కూడా దిగిరాలేదు. మంత్రి రాజ్‌సాథ్ సింగ్ ప్రకటన చేస్తూ.. దేశ రక్షణకు సంబంధించిన విషయంలో విపక్షాలు రాజకీయాలు చేయరాదని అన్నారు. పార్లమెంటు రక్షణ బాధ్యత స్పీకర్ చేతిలో ఉంటుందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీ ఓ ప్రకటన చదివి వినిపించారు. స్పీకర్ ఓంబిర్లా కూడా భద్రతాలోపంపై సభలో ప్రకటన చేశారు. 'పార్లమెంటు రక్షణ బాధ్యత పార్లమెంటు సెక్రటేరియేట్‌దే' అని పేర్కొన్నారు.



పార్లమెంట్‌లో భద్రత వైఫల్యంపై రాజ్యసభలో ప్రతిపక్ష ఎంపీల నిరసన

తొలుత 15 మంది ఎంపీల సస్పెన్షన్

సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగించినందుకు లోక్‌సభ, రాజ్యసభ నుంచి 15 మంది ఎంపీలను సస్పెండ్ చేశారు. లోక్‌సభలో 14 మంది విపక్ష సభ్యులను శీతాకాలం సెషన్ మొత్తం సస్పెండ్ చేసే రెండు తీర్మానాలను ప్రహ్లాద్ జోషీ ప్రవేశపెట్టారు. మొదట టీఎన్ ప్రతాపన్, హిబీ ఈడెన్, జ్యోతిమణి, రమ్య హరిదాస్, డీన్ కురియాకోస్‌ను సస్పెండ్ చేసే తీర్మానాన్ని సభ ఆమోదించింది. ఆ వెంటనే స్పీకర్ సభను వాయిదా వేశారు. 3 గంటలకు తిరిగి ప్రారంభమైనా ఆందోళన తగ్గకపోవటంతో వీకే శ్రీకందన్, బెన్నీ బెహనన్, మొహమ్మద్ జావేద్, పీఆర్ నటరాజన్, కనిమొళి, కే సుబ్బరాయన్, ఎస్ఆర్ పార్థిబన్, ఎస్ వెంకటేశన్, మానిక్కం ఠాకూర్‌ను సస్పెండ్ చేసే తీర్మానాన్ని జోషీ సభలో ప్రవేశపెట్టడంతో సభ ఆమోదించింది. అనంతరం సభను స్పీకర్ శుక్రవారానికి వాయిదా వేశారు. రాజ్యసభలో ఆందోళన చేపట్టిన టీఎంసీ ఎంపీ డెరెక్ ఓబ్రియాన్‌ను చైర్మన్ జగ్‌దీప్ ధన్‌కర్ సస్పెండ్ చేశారు. అయినా ఆయన బయటకు వెళ్లకపోవటంతో రూల్ 192 ప్రకారం సభా హక్కుల ఉల్లంఘన కింద డెరెక్ వ్యవహారాన్ని ప్రివిలేజ్ కమిటీకి సిఫారసు చేయాలని సభా నాయకుడు పీయూష్ గోయల్ కోరారు. దీనికి ధన్‌కర్ ఆమోదం తెలిపారు.

ప్రజాస్వామ్యం ఖూనీ

ఎంపీల సస్పెన్షన్‌పై విపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశాయి. సభలు వాయిదా పడిన తర్వాత విపక్ష పార్టీల నాయకులంతా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కార్యాలయంలో సమావేశమయ్యారు. అనంతరం ఖర్గే ట్వీట్ చేస్తూ.. 'పార్లమెంటుకు, పార్లమెంటు సభ్యులకు తీవ్రమైన భద్రతాలోపం ఏర్పడిన నేపథ్యంలో దీనిపై రెండు సభల్లో కేంద్ర హోంమంత్రి సవివరమైన ప్రకటన చేయాలని ఇండియా కూటమితోపాటు ఇతర విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ అంశంపై సభలో చర్చ చేపట్టాలని కోరుతున్నాము' అని పేర్కొన్నారు. సభ్యుల సస్పెన్షన్‌పై కాంగ్రెస్ నేత అధిర్‌రంజన్ చౌదరి తీవ్రంగా స్పందించారు. 'ఈ చర్చ ప్రజాస్వామ్యాన్ని హత్యచేయటమే. పార్లమెంట్‌ను రబ్బర్ స్టాంపుగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నది' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. దుండగులకు పాసులు ఇచ్చిన బీజేపీ ఎంపీపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా, ఘటనపై నిరసన తెలిపిన ఎంపీలను సస్పెండ్ చేశారని కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్ ఆరోపించారు.

సభలో లేని పార్థిబన్ సస్పెండ్

లోక్‌సభలో సభ్యుల సస్పెన్షన్‌పై ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తంచేయటంతో పాటు కేంద్రంపై సెటైర్లు వేశాయి. అందుకు కారణం సభలో లేని ఎంపీ పార్థిబన్‌ను కూడా సస్పెండ్ చేయటమే. డీఎంకే ఎంపీ పార్థిబన్ గురువారం సభకు హాజరు కాలేదు. ఆయన అసలు ఢిల్లీలోనే లేరు. చెన్నైలోనే ఉన్నారని డీఎంకే వర్గాలు తెలిపాయి. కానీ, సస్పెన్షన్ తీర్మానంలో ఆయన పేరును కూడా ప్రహ్లాద్ జోషీ చేర్చటంతో స్పీకర్ సస్పెండ్ చేశారు. దీనిపై డీఎంకే, కాంగ్రెస్ నేతలు సెటైర్లు వేశారు. 'సభలో పెద్ద జోక్ జరిగింది. సస్పెండ్ అయిన ఎంపీల లిస్టులో ఎస్ఆర్ పార్థిబన్ పేరు ఉన్నది. ఆయన గురువారం సభకే రాలేదు. తమిళులను ప్రభుత్వం గుర్తుపట్టడం లేనట్టున్నది' అని కాంగ్రెస్ ఎంపీ కార్తి చిదంబరం ఎద్దేవా చేశారు. అనంతరం సస్పెన్షన్ జాబితా నుంచి ప్రభుత్వం పార్థిబన్ పేరును తొలగించింది. దీంతో సస్పెండ్ అయిన సభ్యుల సంఖ్య 13కు తగ్గింది.

శివరామ్ హెబ్బార్

ఎస్‌టీ సోమేశేఖర్

హెచ్ విశ్వనాథ్

కర్ణాటక కాంగ్రెస్ విందులో బీజేపీ ఎమ్మెల్యేలు

- లోక్‌సభ ఎన్నికలకు ముందు పార్టీ మారుతారని జోరుగా ఊహాగానాలు
- అబ్బే.. అదేం లేదన్న డీకే శివకుమార్
- తమ ఎమ్మెల్యేలపై బీజేపీ సీరియస్

బెంగళూరు, డిసెంబర్ 14: కర్ణాటకలో అధికార కాంగ్రెస్ విందు రాజకీయం.. బీజేపీలో తీవ్ర కలకలం రేపుతున్నది. బుధవారం రాత్రి కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ సమావేశం అనంతరం బెళగావిలో ఏర్పాటుచేసిన విందులో బీజేపీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు, ఒక ఎమ్మెల్సీ పాల్గొన్న సంగతి మీడియాకు లీక్ అయ్యింది. ఎమ్మెల్యేలు ఎస్‌టీ సోమేశేఖర్, శివరామ్ హెబ్బార్, ఎమ్మెల్సీ హెచ్ విశ్వనాథ్ అధికార కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన విందులో పాల్గొనటంపై బీజేపీ అధిష్ఠానం ఆగ్రహం వ్యక్తం చేసింది. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓటమి తర్వాత ఆ పార్టీలో వారు కొనసాగలేకపోతన్నట్టు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతున్నది. లోక్‌సభ ఎన్నికలకు ముందు వారు కాంగ్రెస్‌లో చేరుతారని ఊహాగానాలు వెలువడుతున్నాయి. తాజా వ్యవహారంపై గురువారం బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర విలేకరులతో మాట్లాడుతూ, కాంగ్రెస్‌తో బీజేపీ ఎమ్మెల్యేలు, ఒక ఎమ్మెల్సీ మంతనాలు జరపటాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్టు పేర్కొన్నారు. దీనిపై వారి నుంచి వివరణ కోరుతున్నట్టు చెప్పారు. *2019*లో పార్టీ ఫిరాయించిన *17* మంది కాంగ్రెస్-జేడీఎస్ ఎమ్మెల్యేల్లో ఈ ముగ్గురు ఉన్నారు. ఆ తర్వాత ఏర్పడ్డ బీజేపీ ప్రభుత్వంలో సోమశేఖర్, హెబ్బార్‌లకు మంత్రి పదవులు దక్కాయి. జేడీఎస్ స్టేట్ చీఫ్‌గా ఉన్న విశ్వనాథ్ *2019*లో పార్టీ ఫిరాయించటం సంచలనం రేపింది. బీజేపీ ఎమ్మెల్యేలతో విందు సమావేశంపై కాంగ్రెస్ నాయకుడు, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ స్పందించారు. వారితో ఎలాంటి చర్చలు జరపలేదని, కేవలం విందుకు మాత్రమే హాజరయ్యారని డీకే ప్రకటించారు. 'వారు కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ సమావేశానికి రాలేదు. కేవలం విందులో పాల్గొనేందుకే వచ్చారు' అని డీకే అన్నారు. ఇదిలా ఉండగా, పార్టీ మారుతున్నారన్న వార్తల్ని ఎమ్మెల్యే సోమశేఖర్ కొట్టివేశారు.

హిందీ జాతీయ భాష కాదు: స్టాలిన్

చెన్నై, డిసెంబర్ 14: హిందీ జాతీయ భాష కాదని, కానీ, అది జాతీయ భాషగా పేర్కొంటూ కొందరు తప్పుదోవ పట్టించేలా వ్యవహరించడం ఆందోళన కలిగిస్తున్నదని తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ అన్నారు. తనకు హిందీ రాదని పేర్కొన్న తమిళనాడుకు చెందిన ఒక మహిళను గోవా ఎయిర్‌పోర్టులో సీఐఎస్ఎఫ్‌కు చెందిన అధికారి అవమానించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. తనకు హిందీ రాదని షర్మిల అనే మహిళ సీఐఎస్ఎఫ్ అధికారికి తెలుపగా, 'మీ తమిళనాడు భారత్‌లోనే ఉంది కదా. ప్రతి భారతీయుడు జాతీయ భాష హిందీ నేర్చుకోవాల్సిందే' అంటూ ఆ అధికారి ఆమెను అవమానించారన్నారు. హిందీ మాట్లాడని రాష్ట్రాల ప్రజలు తరచూ ఎయిర్‌పోర్టులలో సీఐఎస్ఎఫ్ సిబ్బంది నుంచి అవమానాలను ఎదుర్కొంటున్నారని, పైగా వారు హిందీ జాతీయ భాషగా పేర్కొంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన 'ఎక్స్'లో పేర్కొన్నారు. దీనిపై మంత్రి ఉదయనిధి స్టాలిన్ స్పందిస్తూ వెంటనే ఆ అధికారిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పార్లమెంట్‌లో అలజడి సూత్రధారి లలిత్ అరెస్ట్

న్యూఢిల్లీ, డిసెంబర్ 14: పార్లమెంట్‌లో బుధవారం స్మోక్ బాంబుల ద్వారా సృష్టించిన అలజడికి ప్రధాన సూత్రధారి అయిన లలిత్ ఝూను పోలీసులు అరెస్ట్ చేశారు. పార్లమెంట్ ఘటన తర్వాత తప్పించుకుని తిరుగుతున్న కోల్‌కతాకు చెందిన ఈ టీచర్‌ను ఢిల్లీలో గురువారం అరెస్ట్ చేశారు. బుధవారం విజిటర్స్ పాస్ పొందలేకపోయిన లలిత్ పార్లమెంట్‌లో జరిగిన అలజడిని తన సెల్‌ఫోన్‌లో రికార్డు చేసి దానిని సామాజిక మాధ్యమంలో అప్‌లోడ్ చేశాడు. అంతేకాక కోల్‌కతాలో ఒక ఎన్జీవో నడుపుతున్న తన సహచరుడికి దాని కాపీని పంపాడు. తర్వాత అక్కడి నుంచి పరారయ్యాడు. కాగా, పార్లమెంట్‌లో అలజడి కేసులో సంబంధం ఉన్న ఆరుగురిలో ఐదుగురిని పోలీసులు ఇప్పటికే అరెస్ట్ చేశారు. నిందితులపై యూఏపీఏ చట్టంలోని వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. దీంతో వీరికి బెయిల్ లభించే అవకాశం లేదు.

లలిత్

'పీఎం మిస్సింగ్'.. 'పార్లమెంట్' నిందితుల కరపత్రం

న్యూఢిల్లీ: పార్లమెంటు భద్రతను ఉల్లంఘించి, బుధవారం లోక్‌సభలో చొరబడిన దుండగులు సాగర్ శర్మ, డీ మనోరంజన్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కొన్ని కరపత్రాలను ఇవ్వాలనుకున్నారని ఢిల్లీ పోలీసులు కోర్టుకు గురువారం తెలిపారు. పార్లమెంటు వెలుపల పసుపు రంగు పొగ బాంబును పేల్చిన నీలం దేవి, అమోల్ షిండే వద్ద కూడా కరపత్రాలు ఉన్నాయని తెలిపారు. వీటిలో ఒకదానిలో, 'పీఎం మిస్సింగ్' అని, ఆయన ఎక్కడ ఉన్నారో సమాచారం తెలిపినవారికి స్విస్ బ్యాంకు నుంచి నగదు పురస్కారం ఇస్తామని ఉందని తెలిపారు. వీరు షూస్‌ను లక్నోలో కొన్నారని తెలిపారు. వీరిని ముంబై, లక్నో తదితర ప్రాంతాలకు తీసుకెళ్లి, దర్యాప్తు చేయవలసి ఉందని, 15 రోజులపాటు తమ కస్టడీకి ఇవ్వాలని కోరారు. అయితే కోర్టు ఏడు రోజులపాటు మాత్రమే పోలీసు కస్టడీకి అనుమతించింది.

నెలసరి వైకల్యం కాదు.. సెలవు ఇవ్వలేం

న్యూఢిల్లీ, డిసెంబర్ 14: మహిళా ఉద్యోగుల నెలసరి దినాలు వేతనంతో కూడిన సెలవుగా ఇవ్వాలన్న ప్రతిపాదనను కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి స్మృతీ ఇరానీ వ్యతిరేకించారు. రాజ్యసభలో బుధవారం ఎంపీ మనోజ్ కుమార్ ఝా అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానం ఇస్తూ మహిళల్లో నెలసరి అనేది జీవన గమనంలో సహజంగా జరిగే ఒక ప్రక్రియ అని, దానికి వైకల్యంగా భావించి సెలవు వంటి సౌకర్యం కల్పించలేమని అన్నారు. అంతేకాకుండా ఈ నెలసరి సెలవు వల్ల మహిళల పనిప్రదేశంలో వివక్షకు దారి తీసే అవకాశం కూడా ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. అయితే నెలసరి సమయంలో శుభ్రత పాటించాల్సిన అవసరం ఉందని అంగీకరించిన ఆమె, దీనిపై ఆరోగ్య శాఖ ఒక ముసాయిదా తీర్మానాన్ని ఆమోదించిందని చెప్పారు. నెలసరి సమయంలో పాటించాల్సిన శుభ్రత, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దేశవ్యాప్తంగా ప్రచారం నిర్వహిస్తామన్నారు. నెలసరి కాలాన్ని మహిళలకు వేతనంతో కూడిన సెలవు దినంగా ప్రకటించాలన్న ప్రతిపాదనేదీ కేంద్రం వద్ద పరిశీలనలో లేదని మంత్రి స్మృతీ ఇరానీ స్పష్టం చేశారు.

మహా రైతుల మృత్యుఘోష

మహారాష్ట్రలో 10 నెలల్లో 2,366 మంది బలవన్మరణం

ప్రభుత్వాలు మారినా తీరని అన్నదాతల వెతలు

67 కుటుంబాలకు పరిహారం పొందే అర్హత లేదన్న అధికారులు!

హైదరాబాద్, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్రలో ప్రభుత్వాలు మారినా రైతుల వెతలు మాత్రం తీరటం లేదు. దేశానికి వెన్నెముకగా చెప్పుకునే మన రైతులు వ్యవసాయం గిట్టుబాటు కాక అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఈ ఏడాది 10 నెలల్లో మహారాష్ట్రలో 2,366 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆ రాష్ట్ర మంత్రి అనిల్ భాయిదాస్ పాటిల్ స్వయంగా అసెంబ్లీకి నివేదించారు. అత్యధికంగా అమరావతి రెవిన్యూ డివిజన్‌లో 951 మంది రైతులు మరణించారని చెప్పారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే కునాల్ పాటిల్ అడిగిన ప్రశ్నకు మంత్రి ఈ మేరకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబర్ వరుకు ప్రభుత్వానికి అందిన నివేదికల ప్రకారం మహారాష్ట్రలో మొత్తం 2.366 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, అందులో ఛత్రపతి శంభాజీనగర్ డివిజన్‌లో 877 మంది, నాగపూర్ డివిజన్‌లో 257 మంది, నాసిక్ డివిజన్‌లో 254 మంది, పుణే డివిజన్‌లో 27 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1 లక్ష చొప్పున సాయం అందించినట్టు చెప్పారు.

ఆదుకోవడంలో మీనమేషాలు

మహారాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని ప్రతిపక్షాలు, రైతు సంక్షేమ సంఘాలు విరుచుకుపడుతున్నాయి. ఆత్మహత్యలు చేసుకొన్న రైతుల కుటుంబాలను ఆదుకోవడంలో కూడా ప్రభుత్వం మీనమేషాలు లెక్కపెడుతున్నదని, నిర్దయగా వ్యవహరిస్తున్నదని బీఆర్ఎస్ మహారాష్ట్ర కిసాన్ సెల్ అధ్యక్షుడు ఆరోపించారు. గత జనవరి నుంచి జూన్ మధ్య మరాఠ్వాడాలో 483 మంది ఆత్మహత్య చేసుకున్నట్లు అధికారిక లెక్కలు చెప్తున్నాయని.. వాస్తవానికి ఆ సంఖ్య ఎక్కువగానే ఉంటుందని రైతు సంఘాలు చెబుతున్నాయి. మరణించిన రైతుల్లో 67 మంది కుటుంబాలు ఎక్స్‌గ్రేషియాకు అర్హత లేవని అధికారులు తేల్చారని ఆరోపించాయి. రూ.1 లక్ష పరిహారం ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించినా.. వాస్తవానికి రూ.30 వేలు మాత్రమే నగదు రూపంలో ఇస్తున్నారని, మిగతా రూ.70 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి భవిష్యత్తులో క్లెయిమ్ చేసుకునేలా చేశారని తెలిపాయి.

డీఎండీకే నూతన ప్రధాన కార్యదర్శిగా ప్రేమలత విజయకాంత్

చెన్నై: డీఎండీకే నూతన ప్రధాన కార్యదర్శిగా ప్రేమలత విజయకాంత్ గురువారం ఎన్నికయ్యారు. పార్టీ వ్యవస్థాపకుడు, ఆమె భర్త 'కెప్టెన్' విజయకాంత్ ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా పార్టీ జనరల్ కౌన్సిల్, ఎగ్జిక్యూటివ్ కమిటీ తిరువేర్కడులో సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నాయి. ఈ సమావేశంలో విజయకాంత్ కూడా పాల్గొన్నారు. లోక్ సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పార్టీకి ఆమె నాయకత్వం వహిస్తారని తెలిపాయి. ఆమె ప్రస్తుతం పార్టీ కోశాధికారిగా వ్యవహరిస్తున్నారు. విజయకాంత్ నవంబరు 18 నుంచి డిసెంబరు 11 వరకు దవాఖానలో చికిత్స పొందారు.

మరాఠా కోటాపై ప్రభుత్వం మాట తప్పింది: జరాంగే

ముంబై: ప్రభుత్వోద్యోగాలు, విద్యా సంస్థల్లో ప్రవేశాల్లో మరాఠాలకు రిజర్వేషన్లు కల్పించాలన్న డిమాండ్‌పై మహారాష్ట్ర ప్రభుత్వం మాట మార్చిందని ఉద్యమకారుడు మనోజ్ జరాంగే గురువారం ఆరోపించారు. ఛత్రపతి శంభాజీ నగర్‌లోని ఓ దవాఖానలో గురువారం విలేకర్లతో మాట్లాడుతూ.. తదుపరి కార్యాచరణను నిర్ణయించేందుకు ఈ నెల 17న సమావేశాన్ని నిర్వహిస్తామని చెప్పారు. ఈ నెల 24లోగా మరాఠాలకు రిజర్వేషన్లను కల్పించాలని ఆయన గతంలో ప్రభుత్వానికి గడువు విధించారు.

అల్బేనియా పార్లమెంట్‌లో నూ పొగ

భారత పార్లమెంట్‌లో నిరసనకారులు అలజడి సృష్టించిన విధంగానే గురువారం అల్బేనియా పార్లమెంట్‌లో ప్రతిపక్ష డెమొక్రటిక్ పార్టీ నాయకులు గులాబీ రంగు పొగ వదిలి అవినీతిపై విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మథుర మసీదుపై సర్వే

మొదటిపేజీ తరువాయి...

కోర్టుకెక్కారు. దీంతో చాలాకాలంగా వివాదం నడుస్తున్నది. అది మొదట్లో హిందూ ఆలయం అవునో కాదో తేల్చాలని భారత పురావస్తు శాఖను స్థానిక కోర్టు గతంలో ఆదేశించింది. ప్రాథమిక సర్వే నిర్వహించిన ఏఎస్ఐ.. పూర్తి సర్వేకు మరికొంత సమయం కావాలని కోరింది. ఆ సమయంలో ఈ వివాదంపై వివిధ కోర్టుల్లో దాఖలైన కేసులన్నీ హైకోర్టు తనకు బదిలీ చేసుకొన్నది. అనంతరం వీటిని విచారించిన జస్టిస్ మయాంక్‌కుమార్ జైన్ ధర్మాసనం.. తీర్పును నవంబర్ 16న రిజర్వ్ చేసింది. తాజాగా గురువారం తీర్పు వెల్లడిస్తూ సర్వేకు అనుమతి ఇచ్చింది. హైకోర్టు పర్యవేక్షణలో సర్వే జరుగుతుందని తెలిపింది. ఇందుకోసం అడ్వొకేట్ కమిషనర్‌ను నియమించనున్నట్టు చెప్పింది. దీనిపై ఈ నెల 18న మరోసారి విచారణ జరిపి పూర్తి వివరాలు చర్చిస్తామని కోర్టు పేర్కొన్నది. షాహీఈద్గా మసీదు కిందనే శ్రీకృష్ణుడి జన్మస్థానం ఉన్నదని పిటిషనర్లు వాదిస్తున్నారు.

న్యాయపోరాటం చేస్తాం: మసీదు కమిటీ

షాహీ ఈద్గా మసీదులో సర్వేకు హైకోర్టు అనుమతించడంపై మసీదు కమిటీ స్పందించింది. హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని షాహీఈద్గా మసీదు నిర్వహణ కమిటీ సెక్రటరీ, న్యాయవాది తన్వీర్ అహ్మద్ తెలిపారు. మసీదు కమిటీ నిర్ణయాన్ని ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు స్వాగతించింది. కమిటీకి అవసరమైన న్యాయ సహాయం అందిస్తామని తెలిపింది.

జ్ఞానవాపీలో ఇప్పటికే సర్వే

వారణాసిలోని జ్ఞానవాపీ మసీదు విషయంలోనూ సర్వే చేపట్టాలని హైకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. కాశీ విశ్వనాథ్ దేవాలయం పక్కనే ఉన్న ఈ మసీదులో పురావస్తు శాఖ సర్వే చేపట్టింది. అయితే సర్వే నివేదికను ఇంకా కోర్టుకు సమర్పించాల్సి ఉన్నది.

ప్రపంచవ్యాప్తంగా తగ్గుతుంటే.. భారత్‌లో పెరుగుతున్నాయ్

న్యూఢిల్లీ: రోడ్డు ప్రమాద మరణాలు ప్రపంచవ్యాప్తంగా తగ్గుముఖం పడుతుంటే.. భారత్‌లో మాత్రం ఏటా పెరుగుతున్నట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ తాజా నివేదికలో వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా 2011-21 మధ్య రోడ్డు ప్రమాద మరణాల్లో 5 శాతం తగ్గుదల నమోదైనట్టు పేర్కొన్నది. అయితే ఇదే వ్యవధిలో భారత్‌లో ఈ సంఖ్య పెరిగినట్టు వెల్లడించింది. ఈ పదేండ్ల వ్యవధిలో ప్రపంచవ్యాప్తంగా రోడ్డు ప్రమాద మరణాల సంఖ్య 1.25 మిలియన్ల నుంచి 1.19 మిలియన్లకు తగ్గగా, భారత్‌లో మాత్రం 1.34 లక్షల నుంచి 1.54 లక్షలకు పెరిగినట్టు వివరించింది. ప్రపంచ రోడ్డు ప్రమాద మరణాల్లో భారత్ వాటా 11 శాతం నుంచి 13 శాతానికి పెరిగినట్టు తెలిపింది.

పార్టీల గుర్తింపు రద్దు మా పని కాదు: ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ, డిసెంబర్ 14: పార్టీల గుర్తింపు రద్దు తమ పని కాదని, అవి చట్టసభలు చూసుకుంటాయని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. దేశంలోని కొన్ని పార్టీల పేర్లు కులం, మతం, జాతి, భాష అర్థాలతో ఉన్నాయని, కొన్ని పార్టీల గుర్తులు జాతీయ జెండా రంగులను పోలి ఉన్నాయని, వాటి గుర్తింపును వెంటనే రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై గురువారం ఢిల్లీ హైకోర్టు స్పందించింది. వాటిపై పార్లమెంటే నిర్ణయం తీసుకోవాలి తప్ప అది న్యాయస్థానాల పరిధిలోకి రావని స్పష్టం చేసింది. 'ఇవన్నీ విధాన నిర్ణయాలు. మేము చట్టాలను చేయం. దీనిపై పార్లమెంటే తగిన విధంగా స్పందించాలి' అని జస్టిస్ మినీ పుష్కరణ అన్నారు.

విదేశాల్లో ఉద్యోగాలపై జాగ్రత్త

విదేశాంగ శాఖ అడ్వైజరీ

న్యూఢిల్లీ: విదేశాల్లో ఉద్యోగాలంటూ వెలువడే నకిలీ ప్రకటనలను చూసి మోసపోవద్దని విదేశీ వ్యవహారాల శాఖ సూచించింది. ఎవరైనా కాంట్రాక్ట్ ప్రాతిపదికన విదేశాల్లో ఉద్యోగాలు చేయాలనుకుంటే రిజిస్టర్ రిక్రూటింగ్ ఏజెంట్స్‌లను మాత్రమే సంప్రదించాలని, చట్టపరమైన నిబంధనలను అనుసరించి మాత్రమే విదేశాలకు వెళ్లాలని కోరింది.

చివరి దశ కాలేయ క్యాన్సర్‌నూ తగ్గించే చికిత్స

హాంకాంగ్, డిసెంబర్ 14: కాలేయ క్యాన్సర్ సోకి చివరి దశలో ఉన్నా, నయం చేసే చికిత్సను హాంకాంగ్ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. స్టీరియోటాక్టిక్ బాడీ రేడియేషన్ థెరపీ, ఇమ్యునోథెరపీ కలిపి క్యాన్సర్ కణితులను రూపుమాపేలా చేసే చికిత్సను యూనివర్సిటీ ఆఫ్ హాంకాంగ్ శాస్త్రవేత్తలు రూపొందించారు. తాము అభివృద్ధి చేసిన ఈ చికిత్సతో *65* ఏండ్ల వ్యక్తిని చివరి దశ నుంచి క్యాన్సర్ తొలి దశకు తగ్గించామని వర్సిటీ ప్రొఫెసర్ అల్బర్ట్ చాన్ చియాన్ తెలిపారు. స్టేజ్-*4* నుంచి స్టేజ్-*1*కు తీసుకొచ్చామని వివరించారు.



లైట్ థెరపీతో అల్జీమర్స్‌కు చెక్!

(స్పెషల్ టాస్క్ బ్యూరో), హైదరాబాద్, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): ఉదయంపూట సూర్యరశ్మితో (లైట్ థెరపీ) శరీరానికి డీ-విటమిన్ మాత్రమే కాదు అల్జీమర్స్ వ్యాధి కూడా తగ్గే అవకాశమున్నదని పరిశోధకులు చెబుతున్నారు. సూర్యరశ్మిలో కాసేపు ఉన్న తర్వాత శరీరం అలసట చెంది ప్రశాంతమైన నిద్ర వస్తుందని, ఇలాంటి నిద్ర మెమొరీ సెల్స్‌ను ఉత్తేజితం చేయడంలో సాయపడుతుందని అంటున్నారు. *2005* నుంచి *2022* మధ్య *598* మంది రోగులపై చేసిన పలు అధ్యయనాల్లో ఈ విషయం వెల్లడైనట్టు చెబుతున్నారు.



క్యాన్సర్ ఇమ్యునోథెరపీ 2.0

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): క్యాన్సర్ చికిత్సలో కీలక ముందడుగు పడింది. కీ